శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## కన్నుల పండుగగా దీపోత్సవం



**కోవూరుడిసెంబరు, 24 ప్రభాతవార్త :** కోవూరులో వెలసియున్న శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో మార్గశిరమాసం, త్రయోదశి కృతికానక్షత్రం నందు ఆదివారం ఆలయంలో దీపోత్సవ కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో స్వామి వారిని ఆరాధించారు. ఈ సందర్భంగా రుత్వికులు నాగరాజాచార్యులు ఈ దీపోత్సవ విశిష్టతను మహిళా భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా బట్టేపాటి శివకుమార్‌రెడ్డి, వారి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## క్రిస్టియన్ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ వేమిరెడ్డి



**నెల్లూరు సిటీ, డిసెంబర్ 24, ప్రభాతవార్త** కరుణామయుడు జీసస్ దయ ప్రజలందరిపై ఉండాలని రాజ్యసభ సభ్యులు, జిల్లా పార్టీ అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. క్రిస్మస్ సందర్భంగా ఆయన జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. సంతోషకరమైన ఈ పర్వదినం నాడు ప్రజలందరూ సుఖ సంతోషాలతో మెలగాలని ఆయన ఆకాంక్షించారు. క్రీస్తు జన్మించి దాదాపు 2 వేల సంవత్సరాలు గడిచినా, ఆయన చూపిన కృప, దయ ఇప్పటికీ నిలిచి ఉన్నాయన్నారు. ప్రజల కోసం జీవితాన్నే త్యాగం చేసిన ఏసు ప్రపంచానికి మార్గనిర్ధేశం చేశాన్నారు. అభాగ్యులపై క్రీస్తు చూపిన ప్రేమ, కరుణ, శాంతి ప్రతి ఒక్కరిలో ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యంగా క్రిస్టియన్ సోదరసోదరీమణులకు ఆయన క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

## నియోజకవర్గ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు



**ఆత్మకూరు ,డిసెంబర్24,ప్రభాతవార్త :** క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ఆత్మకూరు నియోజకవర్గంలోని క్రైస్తవ సోదరులకు ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. సాటి మనుషుల పట్ల ప్రేమ, సమస్త జీవులపై కరుణ కలిగిన ఏసు ప్రభువు జీవన శైలిని బోధనలను పాటించడమే క్రిస్మస్ పండుగకు అసలైన అర్థమనానౖఉ. శాంతియుతజీవనం , శత్రువునైనా క్షమించే గుణం అందిరికి అవసరమ న్నారు.మానవాళికి జీసస్ తమజీవితం ద్వారా ఇచ్చిన మహోన్నత సం దేశాలను పాటించాలన్నారు. క్రీస్తు బోధనలు ఎప్పటికప్పుడు మనుషులందరిని సన్మార్గంలో నడిస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## ఆడుదాం ఆంధ్రకు మద్దతుగా జిల్లా వైఎస్సార్‌సీపీ యూత్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ




**నెల్లూరు సిటీ, డిసెంబర్ 24, ప్రభాతవార్త** క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వారి ప్రతిభకు అండగా నిలిచేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ యూత్ ఆధ్వర్యంలో సరోవదయ కళాశాల సెంటర్ నందు వీఆర్‌సీ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. నెల్లూరు పార్లమెంటు సభ్యులు, రూరల్ ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ ఆనం అరుణమ్మ, నగర మేయర్ పొట్లూరు స్రవంతి జయవర్ధన్, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ ఆనం విజయ కుమార్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, ఏఎంసీ చైర్మన్ పేర్నాటి కోటేశ్వరరెడ్డి తదితరులు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన క్రీడలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సహకారంతో రెట్టించిన ఉత్సాహంతో యువ క్రీడాకారులు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు.

## రానున్న ఎన్నికల్లో నెల్లూరు జిల్లాలోని పది ఎమ్మెల్యే, ఎంపి స్థానం కైవసం చేసుకుంటాం



**కావలి, డిసెంబరు 24 ప్రభాతవార్త** రానున్న ఎన్నికలలో శ్రీ పొట్టి శ్రీరాములు పాత నెల్లూరు జిల్లాలోని పది అసెంబ్లీ స్థానాలు, ఎంపి స్థానంతో వైసిపి విజయఢంకా మోగిస్తుందని మాజీ మంత్రి పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్ జోస్యం చెప్పారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసానికి ఆదివారం రాత్రి మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ విచ్చేశారు. ఆయనకు ఎమ్మెల్యే స్వాగతం పలికారు. జిల్లాలో తమ మధ్య వున్న స్పర్ధలను పక్కనపెట్టి అందరి గెలుపుకు కృషి చేస్తామన్నారు. మళ్లీ రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగనన్నను గెలిపించుకుంటామన్నారు. ఎవరెన్ని మాటలు చెప్పినా ప్రజలు నమ్మవద్దని ఆయన కోరారు. ఇటీవల కావలిలో వైసిపి నిర్వహించిన సామాజిక సాధికార బస్సుయాత్ర జరిగినప్పుడు తాను తిరువన్నామ్మలైకి వెళ్లానన్నారు. హాజరుకాలేకపోయానన్నారు. అందువల్ల ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసానికి వచ్చి పలకరించి వెళ్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్కాబ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు,వైసిపి నేతలు ప్రముఖ రియల్టర్ జనిగర్ల మహేంద్ర యాదవ్, కనమర్లపూడి వెంకట నారాయణ, పందిటి కామరాజు, కుందుర్తి శ్రీనివాసులు, కుందుర్తి కామయ్య, అయ్యావారు కృష్ణారెడ్డి, కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి, చెన్ను ప్రసాద్‌రెడ్డి, వడ్లమూడి వెంకటేశ్వర్లు, గుర్రం వెంకటేశ్వర్లు(జివి), గుడ్లూరు మాల్యాద్రి, ఏగూరు చినపుల్లయ్య, నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నృసింహుని నిత్య అన్నదానానికి రూ.1,11,116 విరాళం

**పెంచలకోన(రాపూరు),డిసెంబరు24ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి నిత్య అన్నదానానికిఆదివారం స్వామి వారి భక్తులు రూ.1.11.116 విరాళం ఆందజేశారు. తిరుపతి జిల్లా వాస్తవ్యులు మామిళ్ల స్వతంత్రబాబు, సునీతా ధర్మతేజ గార్లు ఈ విరాళాన్ని స్వామి వారి అన్నదానికి ఆందజేశారు.కోనకు వచ్చిన స్వామి వారిభక్తులైన వీరు ముందుగా స్వామి వారిని ఆదిలక్ష్మీ అమ్మవారిని,అంజనేయ స్వామి వారిని దర్శించుకోని పూజలునిర్వహించారు. అనంతరం స్వామి వారి నిత్య అన్నదానానికి మహారాజపోషకులుగా ఈ విరాళాన్ని ఆలయ కార్యనిర్వహాణాధికారి కె.జనార్ధన్ రెడ్డికి ఆందజేశారు.

## వైభవంగా హనుమత్ వ్రతం



సంగం డిసెంబర్ 24 ప్రభాతవార్త మండలకేంద్రమైన సంగంలోని అభయాం జనేయస్వామి ఆలయంలో వైభవంగా హనుమద్ వ్రతం నిర్వహించారు. స్వామివారిని అత్యంత సుందరంగా పూలతో అలంకరించారు. పెద్దఎత్తున మహిళలు ఈకార్యక్రమంలో పాల్గోని స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

# రైతులు పురుగు మందు డబ్బాలతో ఆందోళన



చేజర్ల డిసెంబర్ 24 ప్రభాతవార్త సోమశిల జలాశయం నుండి దక్షణ కాలువ ద్వారా సాగునీరు అందించాలని మరోసారి నాగులవెలటూరు గ్రామానికి చెందిన రైతులు ఆదివారం రహదారిపై ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా నాగుల వెలటూరు ప్రధాన రహదారిపై కర్రలు అడ్డుగా వేసి మందుడబ్బాలు చేతిలో పట్టుకొని రహదారిపై భారీగా రైతులు చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రైతులు మాట్లాడుతు సాగునీటి కోసం గత పదిరోజుల క్రితం ఆందోళన వ్యక్తం చేయగా ఇరిగేషన్ శాఖాధికారులు ఉన్నతాధికారులతో మాట్లాడి సాగునీరు వదులతామని హామి ఇచ్చారు. కాని ఇంతవరకు హామి నెరవేరకపోవడంతో మరోకసారి ఆందోళన చేపట్టాల్సి వచ్చిందని చెప్పారు. ముందస్తుగా నార్లు పోసుకొని సాగునీరు రాకపోవడంతో నార్లన్ని ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 2 వేల ఎకరాలు వరి పెట్టేందుకు సిద్ధంగా ఉన్నా సాగునీరు రాకపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లాధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి సాగునీరు ఇవ్వాలని వారు కోరుతున్నారు. రహదారిపై ఆందోళన చేయడంతో భారీగా ట్రాఫిక్ ఆగపోవడంతో చేజర్ల ఎస్ఐ ప్రత్యామ్నయంగా వాహనాలను మరో మార్గంలో తరలించారు. పెద్దఎత్తున రైతులు పాల్గోన్నారు.

## రూ.150 కోట్లతో నెల్లూరు రూరల్ అభివృద్ధి : ఎంపీ ఆదాల



**నెల్లూరు సిటీ, డిసెంబర్ 24, ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ నియోజకవర్గం సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నామని నెల్లూరు పార్లమెంటు సభ్యులు, రూరల్ ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. రూరల్ నియోజకవర్గంలోని 28వ మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్లో నూతనంగా నిర్మాణం చేసిన సిమెంటు రోడ్లను ప్రారంభించారు. అనంతరం శాంతినగర్‌లో 28వ డివిజన్ అధ్యక్షులు నెల్లూరు మదన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డికి ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి స్థానిక ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ఇప్పటి వరకు రూ.150 కోట్ల రూపాయల నిధులతో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 18 గ్రామ పంచాయతీలలో 26 మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్‌లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేశామన్నారు. నియోజకవర్గ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రానున్న రెండు మూడు మాసాలలో మరో 60 కోట్ల మేర నిధులు మంజూరు చేసి వివిధ అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేస్తామని తెలిపారు. 28వ డివిజన్‌ను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు మరో కోటి రూపాయలు నిధులను అభివృద్ధి పనులకు మంజూరు చేస్తున్నట్లు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. అనంతరం నియోజకవర్గ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తున్న నగర మేయర్ పొట్లూరి స్రవంతి జయవర్ధన్, నెల్లూరు విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తదితరులను శాంతినగర్ వాసులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ అధ్యక్షులు టీవీఎస్ కమల్, 28వ డివిజన్ కన్వీనర్లు సురేష్‌రెడ్డి, కార్పొరేటర్లు షేక్ సత్తార్, తాళ్లూరు అవినాష్, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి సీహెచ్ హరిబాబు యాదవ్, జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వేలూరు శివ సునీల్‌రెడ్డి, డివిజన్ వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## బంగారు భవితకు, మానసిక పరిపక్వతకు క్రీడలు ఎంతో అవసరం



**ఆత్మకూరు,డిసెంబర్24,ప్రభాతవార్త :** యువత బంగారు భవితకు, మానసిక పరిపక్వతకు క్రీడలు ఎంతో తోడ్పాటును అందిస్తాయని , ప్రతి ఒక్కరూ ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగస్వాములై ఉత్తమంగా రాణించి అత్యున్నత శిఖరాలకు చేరాలని ఆత్మకూరు నియోజకవర్గ శాసన సభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాల క్రీడా మైదానంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా అవగాహనా కార్యక్రమానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలసి విక్రమ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎంతో దూరాలోచనతో చేసిన ఆడుదాం ఆంధ్రా లాంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఇంతటి భారీ స్థాయిలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రతి సచివాలయం, ప్రతి మండలం, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా ఇలాంటి క్రీడా సంబరాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో ఐదు రకాల క్రీడాంశాల్లో సుమారు 24వేల మంది క్రీడా కారులు నమోదు చేసుకున్నారన్నారు. ఇంత స్థాయి లో నమోదుకు కృషి చేసినఅధికారులకు వైసిపి నాయకులు , ప్రజా ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. బంగారు భవితకు, మానసిక పరిపక్వతకు క్రీడలు ఎంతగానో తోడ్పాటును అందిస్తాయని , ఉన్నత విద్యకోసం అమెరికాలో విద్యాభ్యాసం చేస్తున్న సమయంలో అక్కడ ప్రారంభించేవారని మన దేశంలో ఇలా గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేలా క్రీడాపోటీలు నిర్వహించడం మన ఆంధ్రప్రదేశ్‌లోనే జరిగిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి ఎంతో ప్రణాళికా బద్ధంగా సచివాలయ వ్యవస్థ ద్వారా అందరూ క్రీడాకారులను ఈ క్రీడాంశాల్లో పాల్గొనేలా చేశారని విజేతలకు నగదు బహుమతులు సైతం ప్రకటించారన్నారు. ఐపిఎల్ లాంటి మూడు నెలల క్రీడాంశాల్లోనే లక్షల ఆదాయం వస్తుందన్న విషయాన్ని యువత గుర్తుచుకోవాలని, క్రీడల ద్వారా అటు పేరుతోపాటు ఇటు ఆర్థికంగా బలవంతులుగా మారవచ్చన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వారి తల్లిదండ్రులు కూడా సహకారం అందించాలని , ప్రతి సంవత్సరం ఇలాంటి క్రీడాపోటీలు నిర్వహిస్తారని విద్యార్థులు అన్నింటా అభివృద్ధి సాధించాలంటే నాడు నేడు పథకం ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేశారని , డిజిటల్ విద్యను వారికి అందజేశారని, ఇంగ్లీష్ బోధన, వసతిదీవెన, విదేశీ విద్య ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యాభివృద్ధికి సిఎం కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు ఒక రాజధాని నిర్మాణమే సరిపోదని 8పోర్టులు, 14షిప్పింగ్‌హార్బర్లను అభివృద్ధి చేస్తే ఆర్థికంగా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు ద్వారా సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందుతున్నాయన్నారు. విద్యాభివృద్ధిని ఏవిధంగా ముఖ్యమంత్రి అభివృద్ధి చేస్తున్నారని ప్రతి విద్యార్థి ఆడుదాం ఆంధ్రాలోభాగస్వాములయ్యేలా చూడాలన్నారు. జాతీయ స్థాయికి ఎంపికయ్యే క్రీడాకారులకు తాను పూర్తిస్థాయిలో సహకారం అందిస్తానన్నారు. సోమవారం నిర్వహించనున్న క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి అందరికి శుభాకాంక్షలు తెలిపారు.

## టీడీపీ కార్యాలయంలో ప్రీ క్రిస్మస్ వేడుకలు



**నెల్లూరు, డిసెంబర్ 24, ప్రభాతవార్త- వైద్యం** నగరంలోని జిల్లా కేంద్ర తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నెల్లూరు పార్లమెంటు టీడీపీఅధ్యక్షులు అబ్దుల్ అజీజ్ పెద్దఎత్తున ప్రీ క్రిస్మస్ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఊరందూరు సురేంద్ర బాబు అధ్యక్షత వహించారు. పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, మాజీ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మిలు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసుప్రభువు గీతాలాపనలు, చిన్న పిల్లల నృత్యాలు అలరింపచేశాయి. ఫాదర్ జోసెఫ్, రెవ బిల్లా విల్సన్ బాబులు దైవ సందేశాన్ని అందించారు. అనంతరం కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించి పలువురు పాస్టర్లకు చిరుకానుకగా దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ హయాంలో పేద క్రిస్టియన్లు పండుగ చేసుకునేందుకు క్రిస్మస్ కానుకను అందించేవారమని, వైసీపీ ప్రభుత్వం దానిని ఆపేసిందని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని యేసుక్రీస్తు బోధనలలో శత్రువును కూడా ప్రేమించాలని ఉందని తెలిపారని, కానీ ఆయన దానికి విరుద్ధంగా చేస్తున్నారని అన్నారు. టీడీపీ హయాంలో క్రిస్టియనన బరియల్ గ్రౌండ్ కోసం అల్లిపురంలో స్థలం కేటాయించామని తెలిపారు. ఈ సందర్భంగా బీద రవిచంద్ర మాట్లాడుతూ క్రిస్మస్ పర్వదినాన క్రిస్టియన్ సోదరుల ప్రార్థనలతో యేసు ప్రభువు ద్వారా చంద్రబాబుకు చల్లని దీవెనలు ఆశీర్వాదాలు అందాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా మాజీ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మీ మాట్లాడుతూ తన బాల్యంలో విద్యాభ్యాసం మొత్తం ఏబీఎం స్కూల్‌లో జరిగిందని, ఈ ప్రీ క్రిస్మస్ వేడుకల ద్వారా తన బాల్యం మళ్ళీ గుర్తొచ్చిందన్నారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ ప్రతి ఏడాది రాజకీయాలకు అతీతంగా ప్రీ క్రిస్మస్ సంబరాలు న్విహించి పాస్టర్లను గౌరవించుకోవడం అదృష్టంగా భావిస్తామని తెలియజేశారు. ఎప్పుడు పిలిచినా మీరందరూ రాము రాలేము అని చెప్పిన దాఖలాలు లేవని, మీ అందరికి ఒక వ్యక్తిగా, పార్టీగా ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. టీడీపీ హయాంలో నిర్మించతలపెట్టిన బాప్టిజం ఘాట్ వైసీపీ ప్రభుత్వ రాకతో ఆగిపోయిందని అన్నారు. దుర్మార్గపు ఆలోచనలు కలిగిన ఏ రాజు క్రైస్తవుడు కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీచైర్మన్ చెంచల్ బాబు యాదవ్, రాష్ట్ర కార్యదర్శి జెన్నీ రమణయ్య, రాజా నాయుడు, పనబాక భూలక్ష్మీ, పాల్ కోటి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగులకు సన్మానం

**నెల్లూరు,డిసెంబరు24 ప్రబాతవార్త-విద్య** జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నగరంలోని స్థానిక ఆర్టీసీ ఆవరణలోని రిటైర్ట్ ఎంప్లాయిస అసోసియేషన్ కార్యలయంలో విశ్రాంత ఉద్యోగులైన 24మందిని సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎంఆర్ రెడ్డి మాట్లాడుతు ఈ కార్యక్రమాన్ని డిసెంబరు 17న జరుపుకోవాల్సి ఉన్నా తుఫాను దృష్ట్యానేడు జరుపుకోవటం జరిగిందన్నారు. పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారం కోసం పాటుపడతామన్నారు. సంస్థలో టిటిఐ గా పదవి విరమణ పొందిన 83 సంవత్సరాల సాంబశిరావు నేటికి ఆరోగ్యంగా ఉంటి అనింటిలో పాలుపుంచుకోవటం సంతోషంగా ఉందని ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## పేద మహిళలకు వస్త్రాలు పంపిణి

**సంగం డిసెంబర్ 24 ప్రభాతవార్త :** క్రిస్మస్ సందర్బంగా క్రీమ్ స్వచ్ఛంద సంస్ద ఆద్వర్యంలో ఆ సంస్ద అద్యక్షులు తడిసిన ఇజ్రాయాలు సంగంలో పేద మహిళలకు చీరలు పంపిణి చేశారు. ప్రతి సంవత్సరం క్రిస్మస్ సందర్బంగా ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పిల్లలకు బాక్స్‌లు, పురుషులకు చొక్కాలు పంపిణి చేస్తున్నట్లు తెలిపారు.క్రిస్మస్ పురస్కరించుకొని పేద మహిళలకు సంగం బైపాస్‌రోడ్డులో,పెట్రోల్ బంకు వద్ద ,గుడారాలలో నివాసాలు ఉండే పేద మహిళలకు చీరలు పంపిణి చేసినట్లు తెలిపారు.క్రిస్మస్ అనగా ఇచ్చుట అని అర్దం అని యేసు ప్రభువువే బహుమానంగా ఈ ప్రపంచానికి రక్షణ కొరకు వచ్చారని ఆయన పేర్కున్నారు.ప్రతి ఒక్కరు పేదవారికి చేతనైన సహాయం చేయాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో పలువురు మహిళలున్నారు.

## అంబేద్కర్ చిత్రపటాలు పంపిణీ



**బిట్రగుంట, డిసెంబరు 24 ప్రభాతవార్త :** బోగోలు మండలం అక్కరాజువారికండ్రిక గ్రామంలో ఆదివారం తెలుగు బాప్టిస్ట్ చర్చి ప్రాంగణంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటాలను మండల ఇన్‌చార్జ్ మహేష్‌మాదిగ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఇటీవల సికింద్రాబాద్‌లో మాదిగ విశ్వరూప మహాసభకు విచ్చేసిన అక్కరాజువారికండ్రిక మాదిగ సోదరులకు వీటిని అందించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏసుపోగు జయరాజ్ మాదిగ, రాధయ్య, రమణయ్యలు పాల్గొన్నారు.

## నిత్యావసర సరుకులు పంపిణీ చేసిన పసుపులేటి



**కావలి రూరల్, డిసెంబరు 24 ప్రభాతవార్త :** కావలి మున్సిపాల్టీ పరిధిలోని 29వ వార్డు బాపూజీనగర్‌లో పసుపులేటి సుధాకర్ ఛారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలలో భాగంగా ఈ ట్రస్ట్ అధినేత పసుపులేటి సుధాకర్ సూచనల మేరకు ఆయన సోదరుడు పసుపులేటి వెంకటేశ్వర్లు 40 నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పసుపులేటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎవరికి ఏ ఆపద వచ్చినా,అవసరం వచ్చినా పసుపులేటి సుధాకర్ తోడుగా వుండి అండగా వుంటారని తెలిపారు. కావలి పట్టణం అభివృద్ధి చెందాలంటే పసుపులేటి సుధాకర్ కావాలని కోరుకోవడం సంతోషంగా వుందని తెలిపారు. నిత్యావసర సరుకులు అందుకున్న పేద కుటుంబాలు పసుపులేటి సుధాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## కావలి పట్టణంలోని పలు చర్చిలలో ప్రీక్రిస్మస్ వేడుకలు



**కావలి రూరల్, డిసెంబరు 24 ప్రభాతవార్త :** కావలి పట్టణంలోని ది సదరన్ తెలుగు బాప్టిస్ట్ చర్చి, తెలుగు బాప్టిస్ట్ చర్చి, సత్య సువార్త సహవాసము చర్చి, షారోన్ బాప్టిస్ట్ చర్చి, ఎబియం బాప్టిస్ట్ చర్చి తదితర చర్చిలలో ఆదివారం ప్రీక్రిస్మస్ వేడుకలు ఘనంగా, ఉత్సాహంగా ఘనంగా జరుపుకున్నారు.ప్రీక్రిస్మస్ వేడుకలలో భక్తి గీతాలు, ప్రత్యేక దైవ సందేశాలు, ప్రార్దనలు, సాంస్కృతిక కార్యక్ర మాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో పాస్టర్లు రెవ.శామ్యూల్ వరప్రసాద్, రోజర్, మూర్తిబాబు, దైవాదీనం, జయసుందరరావు, యువకులు పాల్గొన్నారు. సోమవారం క్రిస్మస్ పర్వదినం సందర్బంగా చర్చిలను విద్యుత్ దీపాలను సుందరంగా అలంకరించారు.

## నేరస్తులకు మద్దతు ఇచ్చి కాపాడుతున్న కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి !




**కావలి, డిసెంబరు 24 ప్రభాతవార్త :** కావలి నియోజకవర్గంలో హత్యలు, దాడులు, దౌర్జన్యాలు, తప్పుడు కేసులు ఎక్కువైపోయాయని, నేరస్తులకు మద్దతు ఇచ్చి కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కాపాడుతున్నారని కావలి అఖిలపక్ష పార్టీల నేతలు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. హత్యలు, దాడులు, దౌర్జన్యాలు, నేరాలు చేస్తున్న వారంతా వైసిపి నాయకులేనని తెలిపారు. వారిని మందలించకుండా ఎమ్మెల్యే కాపాడటం దుర్మార్గమన్నారు. కావలి పట్టణ రైల్వే రోడ్డులోని జర్నలిస్ట్ క్లబ్‌లో ఆదివారం అఖిలపక్ష పార్టీల నేతలు ప్రముఖ న్యాయవాది చింతాల వెంకట్రావు, పసుపులేటి పెంచలయ్య (సిపియం), కరవది భాస్కర్(సిపిఐయంయల్ న్యూడెమోక్రసి), కొప్పర్తి నాగరాజు (సిపిఐ), పొబ్బా సాయివిఠల్ (జనసేన), బలిజేపల్లి వెంకటేశ్వర్లు (రైతు సంఘం నాయకుడు) పాల్గొని మాట్లాడారు. పోలీసులు మాత్రం ఎమ్మెల్యే చెప్పిందే శిరోధార్యంగా భావిస్తూ పనిచేస్తున్నారని విమర్శించారు. పోలీసులకు జీతాలు ఇచ్చేది ప్రభుత్వమా, కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డా అంటూ వారి ప్రశ్నించారు. గత రెండు మూడేళ్లుగా కావలి నియోజకవర్గంలో వైసిపి నాయకుల ఆగడాలు మితిమీరిపోయాయన్నారు. వీరిని ఆదిలోనే నిరోధించాల్సిన పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించడంతో ముసునూరులోని ఆటోనగర్‌లో సూరిశెట్టి సురేష్ కత్తుల దాడిలో దారుణంగా హత్యగావింపబడ్డాడన్నారు. గతంలో ముసునూరుకు చెందిన కరుణాకర్, ఉలవపాళ్ళ పెట్రోలు బంకులో పనిచేస్తున్న గోచిపాతల తేజ, పైడి హర్షాలపై దాడులు చేసింది వైసిపి పార్టీకి చెందిన వారేనన్నారు. నేడు సూరిశెట్టి సురేష్ హత్య కేసులో వైసిపి పార్టీకి చెందిన పుల్లా సుబ్బారెడ్డి, చలంచర్ల విజయ్‌కుమార్‌రెడ్డిలు ముద్దాయిలన్నారు. ఇలా వరుస దాడులు జరుగుతుంటే ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మా పార్టీకి సంబంధం లేదంటూ చేతులు దులుపుకోవడం హాస్యాస్పదంగా వుందన్నారు. ఎమ్మెల్యే, పోలీసుల తప్పిదం వల్లే సురేష్ దారుణ హత్య.సూరిశెట్టి సురేష్, పుల్లా సుబ్బారెడ్డిల మధ్య ఇంటి విషయం, ఆర్థిక లావాదేవీల గొడవపై కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కావలి డిఎస్పీ వెంకట రమణను సూరిశెట్టి సురేష్ పలుమార్లు కలిసి న్యాయం చేయాలని కోరడం జరిగిందని అఖిలపక్ష పార్టీల నేతలు తెలిపారు. ఈ విషయం సాక్షాత్తు ఎమ్మెల్యే మీడియా సమావేశంలో చెప్పారన్నారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, డిఎస్పీ వెంకట రమణలు ఇరువురిని మందలించి సకాలంలో న్యాయం చేసి వుంటే సురేష్ దారుణ హత్యకు గురయ్యేవాడు కాదని తెలిపారు. వీరితప్పిదం వల్లే ఈ హత్య జరిగిందన్నారు. పోలీసులు ప్రైవేట్ పంచాయతీలు చేస్తూ డబ్బులు వసూలు చేసుకుంటున్నారని దుయ్యబట్టారు. నేరాన్ని ప్రోత్సహించడం కూడా చట్టరీత్యా నేరమన్నారు. ఈ హత్య కేసులో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, పోలీసులు కూడా నేరస్తులేనన్నారు. పోలీసులు ప్రభుత్వ జీతాలు తీసుకుంటూ బాధితులకు న్యాయం చేయకపోగా వచ్చిన వారి దగ్గరే లంచాలు తీసుకుంటుంటే ఇక న్యాయం చేసేది ఎవరని వారు ప్రశ్నించారు. ఈ పోలీస్ అధికారులు ప్రభుత్వం దగ్గర కాకుండా ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి దగ్గర జీతాలు తీసుకుంటే తాము ప్రశ్నించేది లేదన్నారు. ప్రజలకు జరుగుతున్న అన్యాయాలపై పోరాడుతున్న అఖిలపక్ష నేతలను కూడా ఎమ్మెల్యే, పోలీసులు బెదిరించడం సరైంది కాదన్నారు. మీరు మమ్మల్ని బెదిరించినా వాస్తవాలు కావలి పట్టణ ప్రజలకు తెలుసునన్నారు. రానున్న ఎన్నికలలో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డిని ప్రజలు ఓడించడం ఖాయమని తెలిపారు. గతంలో కూడా మన్నంగిదిన్నె గ్రామానికి చెందిన కాపు నాయకుడు జింకల మాలకొండయ్యను హత్య చేసింది కూడా చలంచర్ల విజయ్‌రెడ్డికి సంబంధించిన బంధువులేనని తెలిపారు.ఈ కుటుంబానికి నేర చరిత్ర వుందన్నారు. ఇంత దారుణానికి వడిగట్టిన వీరిపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. హత్యగావింపబడ్డ సూరిశెట్టి సురేష్ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## సెటిల్‌మెంట్ పట్టాలో అక్రమంగా రోడ్డు నిర్మాణం





**కావలి, డిసెంబరు 24 ప్రభాతవార్త :** మా అనుభవంలో వున్న పట్టా భూమిలో 691 సర్వే నెంబరులో అక్రమంగా మామిడి చెట్లను నరికి సిమెంటు రోడ్డును వేస్తున్నారని ఇది ఎక్కడ న్యాయమని అడిగితే కాంట్రాక్టర్ లెక్క చేయడం లేదని బాధితులు దుగ్గిరాల పెనుకొండయ్య, ప్రసాద్‌బాబులు వాపోయారు. కావలి పట్టణం రైల్వే రోడ్డులోని జర్నలిస్ట్ క్లబ్‌లో బోగోలు మండలానికి చెందిన పెనుకొండయ్య, ప్రసాద్‌బాబులు మీడియా సమావేశం నిర్వహించారు. కాంట్రాక్టర్‌కు కావలి ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్‌రెడ్డి మద్దతు ఇవ్వడంతో తమకు అన్యాయం జరిగిందన్నారు. బోగోలు మండలం జువ్వలదిన్నె గ్రామం హరిజనవాడలో తమ పూర్వికులు పిత్రార్జితంకు చెందిన 691 సర్వే నెంబరులో 80 సెంట్ల భూమి తమ హక్కు అనుభవంలో వుందన్నారు. గత కొన్నేళ్లుగా సెటిల్‌మెంట్ పట్టా కలిగి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. ఈ భూమిలో మా దళితవాడకు చెందిన పచ్చ కిరణ్, దుగ్గిరాల చిన్నా, చీకటి ప్రసాద్, చిన్న నరసింహ, పచ్చ రమేష్, పిడుగు ప్రసాద్, శ్రీనివాసులు, పిడుగు రాజాలు తమపై కక్షగట్టి ఎమ్మెల్యే అండదండలతో అధికారులతో కలిసి కోర్టు ఉత్తర్వులు సైతం లెక్కచేయకుండా తమ భూమిలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి డస్టర్ మట్టిని తోలారన్నారు. అక్రమంగా వేస్తున్నారన్నారు. ఈ సమస్యపై రెవెన్యూ అధికారుల్ని,పోలీసుల్ని ఆశ్రయించినా స్పందన కరవైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా రోడ్డు వేస్తున్న వారిపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## మహిళలకు చీరలు పంపిణీ



**వరికుంటపాడు,డిసెంబర్ 24,ప్రభాతవార్త :** క్రిస్మస్ పండుగ సందర్భంగా తోటలచెరువుపల్లి గ్రామంలోని క్రైస్తవ మహిళలకు స్థానిక నేత ముల్లంగి శ్రీను తన మాతృమూర్తి ముల్లంగి కనకమ్మ జ్ఞాపకార్థం అందజేసిన చీరలను సర్పంచ్ పేర్ణంపాటి పెద్ద మౌలాలి ,మాజీ సర్పంచ్ మూల శ్రీను లు అందజేశారు.ఆదివారం తోటలచెరువుపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీ లో సుమారు 40 మంది మహిళలకు ముల్లంగి శ్రీను తన దాతృత్వంతో సమకూర్చిన చీరలను మహిళలకు అందజేసి ,పండుగను అందరు కలిసి కట్టుగా ,ఆనందంగా జరుపుకోవాలనీ కోరారు.ముల్లంగి శ్రీను చేస్తున్న సేవలకు గ్రామ పెద్దలు,ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమములో గ్రామ పెద్దలు సుంకె మాలకొండయ్య, పత్తి జాని,పులి సురేష్,షేక్ చిన్న మౌలాలి,నరేంద్ర ,గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## 25వేల స్వీటు బాక్సులు పంపిణీ




**వింజమూరు ,డిసెంబర్24,ప్రభాతవార్త :** ఉదయగిరి నియోజకవర్గంలోని క్రైస్తవ సోదరుల కుటుంబాలకు కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 209చర్చిలకు 25వేల స్వీట్ బాక్సులను అందజేశారు. ఆదివారం స్థానిక కాకర్ల చారిటబుల్ ట్రస్ట్, అన్న క్యాంటీన్ వద్ద విశ్రాంత డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కె.మాశిలామణి నియోజకవర్గంలోని అన్ని మండలాలకు ట్రస్ట్ మేనేజర్ మన్నెం మధురెడ్డి లు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కాకర్ల సురేష్ నియోజకవర్గంలోని అన్ని వర్గాల పేద ప్రజలకు అండగా ఉంటూ అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నారన్నారు. వింజమూరు కేంద్రంగా అన్న క్యాంటీన్, ఉచితంగా మహిళలకు కుట్టు మిషన్లు, యువతీ యువకులకు కారు డ్రైవింగ్ తదితర అనేక సేవా కార్యక్రమాలను చేపడుతూ ఈప్రాంత ప్రజల అభిమానాన్ని అనతికాలంలోనే చూరగొన్నారన్నారు. క్రిస్మస్ సందర్భంగా నియోజకవర్గంలోని క్రైస్తవ సోదరులకు చర్చిలకు వచ్చే బహుజనులకు స్వీట్‌లను అందించి వారి జీవితాలు సంతోషమయం కావాలని సురేష్ ఆకాంక్షించడం శుభపరిణామమన్నారు. పేద ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని సంజీవిని ఆరోగ్య రథం ద్వారా ఎంతోమందికి వైద్యసేవలు అందజేశారన్నారు.ఈకార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి జిల్లా మహిళా సంయుక్త కార్యదర్శిగా 'కోటా'



**వింజమూరు,డిసెంబర్24,ప్రభాతవార్త :** వైసిపి జిల్లా మహిళా సంయుక్త కార్యదర్శిగా వింజమూరులోని జైభీం నగర్‌కు చెందిన కోటా నాగమణికి జిల్లా పార్టీ అధిష్టానం ప్రకటించింది. నాగమణి కి ఈ పదవి రావడం పట్ల ఉదయగిరి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, మండల కన్వీనర్ రేవునూరు శ్రీనివాసులురెడ్డి, జడ్పీటిసి సభ్యులు గణపం బాల కృష్ణారెడ్డి, పార్టీలోని ముఖ్య నేతల సహకారంతోనే తనకు ఈ పదవి లభించిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపి గెలుపుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ పదవి రావడానికి కృషి చేసిన వైసిపి నాయకులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈసందర్భంగా వైసిపి ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్తను వరు కలిసి శాలువాలు, పూలమాలలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

## అజీజ్‌కు దీవెనలిచ్చిన జోసెఫ్



**నెల్లూరు, డిసెంబర్ 24, ప్రభాతవార్త-వైద్యం :** క్రిస్మస్ సందర్భంగా నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ అబ్దుల్ అజీజ్‌ను హరినాధపురంలోని ఆయన నివాసంలో ఫాదర్ జోసెఫ్ మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక ప్రార్ధనలు చేసి దీవెనలు అందించారు.

## టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించిన తడకపల్లి సుధారాణి



**నెల్లూరు, డిసెంబర్ 24, ప్రభాతవార్త-వైద్యం :** రూరల్ నియోజకవర్గ పరిధిలోని 24వ డివిజన్ కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డులో నూతన తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరక్టర్ తడకపల్లి సుధారాణి ఆదివారం ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిధులుగా రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ 24వ డివిజన్ చాలా పెద్ద ప్రాంతమని సామాన్య, మధ్య తరగతి, పేద కుటుంబాలు ఎక్కువగా నివసిస్తుంటాయన్నారు. ఈ ప్రాంత ప్రజలందరికి ఈ కార్యాలయం ఎప్పుడు అందుబాటులో ఉండే విధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యాలయం ప్రజా సమస్యల పరిష్కార వేదికగా మారాలని శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇక్కడ ప్రజలకు ఏ అవసరం వచ్చినా కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఉందని, అక్కడికి వెళ్తే మనకు సమాధానం చెబుతారు, పరిష్కారం దొరుకుతుందనే విధంగా కార్యకలాపాలను కొనసాగించాలని ఎమ్మెల్యే వివరించారు.

## ఆడుదాం ఆంధ్రాపై అవగాహన ర్యాలీ




**సైదాపురం, డిసెంబర్ 24, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ఈనెల 26వ తేదీ నుండి ప్రారంభం కానున్న నేపథ్యంలో భాగంగా సన్నాహక ఏర్పాట్లు ఆడుదాం కార్యక్రమం జరుగు విషయమై ఇన్‌ఛార్జీ ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ ఆధ్వర్యంలో సైదాపురంలో సచివాలయ సిబ్బంది ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉన్న 19 సచివాలయాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించడం జరిగిందని, ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-1 దయాకరరావు, ఎంఈఓ-2 సుప్రియ, గ్రామ సర్పంచ్ వెందోటి శారదమ్మ, పంచాయతీ కార్యదర్శులు శశిఇంద్రాణి, వంశీకృష్ణ, పీడీ కోటేశ్వరరావు, ఉపసర్పంచ్ శివకుమార్ యాదవ్, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మహాసభను జయప్రదం చేయాలి



**సైదాపురం, డిసెంబర్ 24, ప్రభాతవార్త :** అఖిల భారత రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా గూడూరు డివిజన్ కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో ఈనెల 30వ తేదీన నిర్వహించే మూడవ మహాసభను విజయవంతం చేయాలని జిల్లా కన్వీనర్ డీపీ పోలయ్య తెలిపారు. సైదాపురంలో ఆయన మాట్లాడుతూ అమరుల త్యాగాలతో తెలంగాణ నక్సల బరి, శ్రీకాకుళం, గోదావరి, లయ, ప్రతిఘటన పోరాటాల సాంప్రదాయాలను పునికి పుచ్చుకొని అఖిల భారత రైతు కూలి సంఘం పురుడుపోసుకుందని తెలిపారు. సైదాపురం మండలంలో భూఆక్రమణ దారుల వద్ద ఉన్న భూములను పోరాటాలు చేసి పేద ప్రజలకు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయు జిల్లా కార్యదర్శి రమేష్, చంగలరావు, నవకోటి తదితరులు పాల్గొన్నారు.

## ఆదమరిస్తే భారీ ప్రమాదమే..!



**సైదాపురం, డిసెంబర్ 24, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన సైదాపురంలోని రామసాగరం గ్రామానికి వెళ్లే రోడ్డు సమీపంలో గూడూరు నుంచి సైదాపురం మార్గంలో ఉన్న రహదారి ఇటీవల తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు రహదారి భారీ కోతకు గురైంది. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉంటూ ఆదమరిస్తే ప్రమాదం భారిన పడే అవకాశం ఉంది. ఈ మార్గంలో రోజు వందలాది మంది ప్రయాణికులు గూడూరు, రాపూరు, పొదలకూరు, కడపకు ప్రయాణిస్తూ ఉంటారు. అదే విధంగా అధికారులు కూడా ఈ మార్గానే తిరుగుతూ ఉన్నా కనీసం పట్టించుకోకపోవడం దుర్మార్గమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే తప్ప పట్టించుకోరా అంటూ ప్రజలు విమర్శిస్తున్నారు. సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకొని కోతకు గురైన రహదారికి మరమ్మత్తులు చేసి ప్రమాదాల భారిన పడకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## క్యాండిల్స్‌తో నిరసన చేపట్టిన అంగన్‌వాడీలు



**కోవూరు, డిసెంబరు24ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అనిన అంగన్‌వాడీ కేంద్రాల ప్రాంతాల్లో ఆదివారం రాష్ట్ర అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు క్యాండిల్స్ చేబూని తన నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వై. సుజతమ్మ మాట్లాడుతూ తమ న్యాయమైన కోర్కెల కోసం గత 13 రోజులుగా శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వానికి కనీసం కరుణ లేదన్నారు. పాదయాత్రలో అంగన్‌వాడీలకు పక్క రాష్ట్రం కంటే వెయ్యి రూపాయలు ఎక్కువ ఇస్తానని చెప్పిన ముఖ్యమంత్రి అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలు అయినా ఆ ఊసే పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్‌వాడీల న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు , ఆయాలు క్యాండిల్స్ చేబూని తమ నిరసన వ్యక్తం చేశారు.

## 108 అంబులెన్స్‌లో ఆడబిడ్డ ప్రసవం



**సైదాపురం, డిసెంబర్ 24, ప్రభాతవార్త :** ఓ గర్భిణీ పురిటి నొప్పులతో బాధపడుతూ 108 అంబులెన్స్‌లోనే ఆడ బిడ్డకు జన్మనిచ్చిన సంఘటన సైదాపురం మండలంలో చోటు చేసుకుంది. 108 సిబ్బంది వివరాల మేరకు మండల పరిధిలోని చీకవోలు గ్రామంలోని గిరిజన కాలనీకి చెందిన ఆర్.చెంచమ్మకు ఆదివారం తెల్లవారుజామున పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే 108కు సమాచారం అందించారు. దీంతో 108 సకాలంలో ఆ గ్రామానికి చేరుకుని పురిటినొప్పులతో బాధపడుతున్న చెంచమ్మకు వైద్య సేవలు అందిస్తూ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ఆమె ఓ ఆడ బిడ్డకు అంబులెన్స్‌లోనే జన్మనిచ్చింది. తల్లిబిడ్డ క్షేమంగా ఉండటంతో ఆమె కుటుంబ సభ్యులు 108 వాహన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈఎన్‌టీ అశోక్‌కుమార్, బీవీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి నగర అధ్యక్షులు కి సతివియోగం

**బుచ్చి డిసెంబర్ 24 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగర బిజెపి అధ్యక్షులు రామిశెట్టి మోహన్‌బాబు సతీమణి రాధిక అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకొని పలువురు బిజెపినాయకులు రాధిక పార్ధివదేహాన్ని సందర్శించి రామిశెట్టి కుటుంబసభ్యులకు తమ ప్రగాఢసానుభూతిని తెలియజేశారు. సోమవారం ఉదయం 11 గంటలకు బుచ్చిరెడ్డిపాళెంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంసభ్యులు తెలిపారు.

## కేకులు పంపిణి చేసిన మేకపాటి



**సీతారామపురం డిసెంబర్ 24 ప్రభాతవార్త** క్రిస్మస్ పండుగ సందర్భంగా మండలంలోని ప్రధాన చర్చలకు వైసిపి ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి కేకులను పంపిణి చేయించారు. ఆదివారం మండలంలోని ప్రధానమైన 31 చర్చలకు వైసిపి మండల కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి అందించారు. ఈ సందర్భంగా చర్చిల పాధర్లు,క్రైస్తవ సోదరులు మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో వైసిపినాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గోన్నారు.

## గిరిజన కుటుంబాలకు రెడ్‌క్రాస్ రిలీఫ్ కిట్లు పంపిణీ



కావలి, డిసెంబరు 24 ప్రభాతవార్త కావలి పట్టణ చెరువుకట్ట సంఘం గిరిజన కాలనీలో మిచౌంగ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన 45 గిరిజన కుటుంబాలకు రెడ్‌క్రాస్ రిలీఫ్ కిట్లను ఆదివారం పంపిణీ చేశారు. టార్పాలిన్ పట్ట,సబ్బులు, షాంప్‌లు, నూనెలు, ఇతర నిత్యావసర వస్తువులతో కూడిన హైజిన్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ రిలీఫ్ టీం ఇన్‌చార్జ్ హరినారపరెడ్డి మాట్లాడారు. మిచౌంగ్ తుఫాన్ కారణంగా గిరిజన కాలనీ ముంపుకు గురైందన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లారన్నారు. ప్రస్తుతం నీరు లేకపోవడంతో గిరిజనులు తిరిగి వారి ఇళ్ళకు చేరుకున్నారన్నారు. తక్షణ సహాయంగా రెడ్‌క్రాస్ జిల్లా సమకూర్చిన రిలీఫ్ కిట్లను అందజేశామన్నారు. వీరికి మరింత సాయం అందేలా ప్రయత్నిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వాలంటీర్లు అనిల్,ప్రమోద్, టీం సేవియర్స్ భార్గవ్, సుశాల్ తదితరులు పాల్గొన్నారు.

## గంధ మహోత్సవంలో కావ్య కృష్ణారెడ్డికి అపూర్వ స్వాగతం



కావలి, డిసెంబరు 24 ప్రభాతవార్త కావలి పట్టణంలోని జెండా చెట్టు సెంటర్‌లోని శ్రీ నాగూర్ మీరాస్వాముల వారి గంధ మహోత్సవంలో కావ్య ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ప్రముఖ పారిశ్రామికవేత్త, టిడిపి నేత దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ గంధ మహోత్సవంలో ముస్లిం యువకులు భారీగా తరలివచ్చి స్వాగతం పలికారు. ఆయనను ఎత్తుకొని కేరింతలు కొట్టారు. దర్గాలో ఆయన ప్రత్యేక ప్రార్దనలు చేశారు. ఆయన జెండాలు పట్టుకొని దర్గాలోకి వెళ్లారు. ఆయన వెంట టిడిపి లీగల్ సెల్ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుంటుపల్లి రాజ్‌కుమార్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## గంధమహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి

**కావలి, డిసెంబరు 24 ప్రభాతవార్త** కావలి పట్టణంలోని జెండా చెట్టు సెంటర్‌లోని శ్రీ నాగూర్ మీరాస్వాముల వారి గంధ మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయనకు దర్గా కమిటీ నిర్వాహకులు, ముస్లిం యువకులు స్వాగతం పలికారు. ఆయన దర్గాలో ప్రత్యేక ప్రార్దనలు చేశారు. ప్రతి ఒక్కరిని పేరుపేరున పలకరించారు.ఆయన వెంట విష్ణువర్ధన్‌రెడ్డి అనుయాయులు గోసల గోపాల్‌రెడ్డి, అనుమాలశెట్టి శివకుమార్, కృష్ణంరాజు, అభిమానులు పాల్గొన్నారు.

## రసంను పరామర్శించిన మేకపాటి



మర్రిపాడు ,డిసెంబర్24,ప్రభాతవార్త : మర్రిపాడు మండలం ఏపిలగుంట సీనియర్ వైసిపి నాయకులు రసం రామకృష్ణారెడ్డి తల్లి రసం ఓబులమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి పరామర్శించారు. ఓబులమ్మ పార్థీవ దేహానికి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈయన వెంటన వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# సూరిశెట్టి సురేష్ హత్యోదంతంపై సమగ్ర విచారణ జరపాలి !



**కావలి, డిసెంబరు 24 ప్రభాతవార్త** కావలి ముసునూరు ఆటోనగర్‌లో టిడిపి కాపునేత సూరిశెట్టి సురేష్ దారుణ హత్యోదంతంపై సమగ్ర విచారణ జరిపి అందరిని కఠినంగా శిక్షించాలని కాపునాడు నేతలు డిమాండ్ చేశారు. కావలి రైల్వే రోడ్డులోని కారొనేషన్ రీడింగ్ రూమ్ నుంచి అన్ని పార్టీలకు చెందిన కాపు నేతలు నిరసన ప్రదర్శనగా కావలి డిఎస్పీ కార్యాలయం, రూరల్ సర్కిల్ కార్యాలయానికి ఆదివారం వెళ్లి అధికారులకు వినతి పత్రాలు అంద జేశారు. ఈ నిరసన ప్రదర్శనలో కాపుల జోలికి వస్తే భరతం పడతామని హెచ్చరికలు చేశారు. కావలి రూరల్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కావలి కాపు నేత, మాజీ ఎయంసి చైర్మన్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడారు. కాపుల్ని రెడ్డి సామాజిక వర్గం హత్యలకు పాల్పడుతున్నారన్నారు. ముసునూరు ఆటోనగర్‌లో టిడిపి నేత సూరిశెట్టి సురేష్‌ను రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వైసిపి నేతలు పుల్లా సుబ్బారెడ్డి, చలంచర్ల విజయ్‌రెడ్డిలు కత్తితో విచక్షణారహితంగా పొడిచి హత్య చేశార న్నారు. ఈ సంఘటనలో ఒక అధికార పార్టీ సర్పంచ్ తమ్ముడు కుమారుడు విజయ్‌రెడ్డి, కావలి పట్టణ 34వ వార్డు వైసిపి ఇన్‌చార్జ్ పుల్లా శ్రీనివాసులరెడ్డి సోదరుడు పుల్లా సుబ్బారెడ్డిలు కలిసి కాపు నేత సురేష్‌ను హత్య చేశారన్నారు. పుల్లా సుబ్బారెడ్డికి, సూరిశెట్టి సురేష్‌కు మధ్య ఆర్థిక లావాదేవీల సమస్య ఏర్పడిందన్నారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పోలీస్ అధికారుల దృష్టికి ఈ సమస్య వచ్చిందన్నారు. వీళ్లందరు కలిసి ఈ సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోయారో, ఎవరి వత్తిడికి లొంగి అశ్రద్ధ వహించారో అర్ధం కావడం లేదన్నారు. ఫలితంగా కాపు నేత సురేష్ దారుణ హత్యకు గురయ్యాడన్నారు. పోలీసులు మాత్రం ఇవన్నీ చీటీల వ్యాపారమని కలుగజేసుకోకూడదని చెప్పడం విడ్డూరంగా వుందన్నారు. చీటీలతో పాటు గ్రామంలో కూలి పనులు చేసుకుంటున్న మహిళలు, ఇంట్లో డబ్బులు దాచుకున్న మహిళలు అందరు కూడా పుల్లా సుబ్బారెడ్డికి వడ్డీలకు ఇచ్చారన్నారు. వడ్డీలు, తీసుకున్న డబ్బులు ఎగగొట్టినప్పుడు పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోరని ప్రశ్నించారు. అయితే అధికార పార్టీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి ఫోన్ చేస్తే పోలీసులు ఎవరినైనా బంధించి డబ్బులు వసూలు చేయిస్తారని తెలిపారు. సురేష్ విషయంలో ఎందుకు న్యాయం చేయలేదని ప్రశ్నించారు. ఇది ఈ రోజు సమస్య కాదని ఒక కాపు కులానికి, ఒక రెడ్డి కులానికి గత 40 సంవత్సరాల నుండి జరుగుతున్న వివాదమన్నారు. మన్నంగిదిన్నె గ్రామంలో 40 సంవత్సరాల క్రితం కాపు నేత జింకల మాలకొండయ్యను ముసునూరులో సురేష్‌ను హత్య చేసిన చలంచర్ల విజయ్‌రెడ్డి పెద్ద నాన్న చలంచర్ల నాగిరెడ్డి, ప్రస్తుత మన్నంగిదిన్నె సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, చలంచర్ల వీరారెడ్డిలు ఆనాడు హత్య చేశారన్నారు. మరలా 40 సంవత్సరాల తర్వాత ఇదే చలంచర్ల కుటుంబానికి వారసుడైన చలంచర్ల విజయ్‌రెడ్డి జింకల మాలకొండయ్య మేనల్లుడు సూరిశెట్టి సురేష్‌ను దారుణంగా హత్య చేశాడన్నారు. ఇది అధికార పార్టీ చేసిన హత్యగా భావిస్తున్నామన్నారు. ఇప్పటికైనా కాపు వర్గీయులందరూ ఏకతాటిపై నడవాలని పిలుపునిచ్చారు. అధికార పార్టీ నేతల జోక్యం వుందని కాపులెవరైనా చేతులు దులుపుకుంటే కులంలో చరిత్ర హీనులుగా మిగిలిపోతారని మలిశెట్టి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఈ సమావేశంలో కాపు నేతలు మాజీ మున్సిపల్ చైర్మన్, ప్రముఖ సర్జన్ డాక్టర్ ఎన్.ప్రభాకర్‌నాయుడు(టిడిపి), పారిశ్రామికవేత్త దామిశెట్టి శ్రీనివాసులనాయుడు, దేవరకొండ శ్రీనివాసులు, మండలి కృష్ణారావు, తిరుమలశెట్టి మహేష్, బండారు మహేష్‌నాయుడు, తోట శ్రీహరి, అల్లిప్రసాద్(వైసిపి), సమ్మను వెంకట సుబ్బయ్య, పొబ్బా సాయివిఠల్, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, (జనసేన), శానం హరి, నాగిశెట్టి మాలకొండయ్య(టిడిపి), కాపు నేతలు నక్కా కుమార్, ఊసా వెంకట్రావు, కావేటి చినకోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

# క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన పలు శాఖల జిల్లా అధికారులు



**నెల్లూరు టౌన్, డిసెంబర్ 24, ప్రభాతవార్త** క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన పలు శాఖల జిల్లా అధికారులు కార్యాలయ సిబ్బందికి, తమ శాఖలోని అధికారులకు, సిబ్బందికి, ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతివ్యక్తికి ప్రేమానురాగాలు పంచేది క్రిస్మస్ అని, ఏసు ప్రభువు ఆశీస్సులు ప్రజలందరికి ఉండాలన్నారు. త్యాగం, ప్రేమ, కరుణ గొప్పతనాన్ని ఏసుక్రీస్తు తన బోధనలు ద్వారా విశ్వ మానవాళికి తెలియజేశారన్నారు. క్రీస్తు అనుసరించిన మార్గం ఎంతో ఆదర్శమన్నారు. యేసుక్రీస్తు ప్రపంచ సర్వమత శాంతి స్థాపన కొరకు పుట్టిన మహనీయుడు, గొప్ప శాంతి దూతన్నారు. క్రైస్తవ సోదర, సోదరీమణులు అందరూ క్రిస్మస్ వేడుకలను ఘనంగా, ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని ఈ సందర్భంగా అధికారులు కోరారు. బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి వై.వెంకటయ్య, మెప్మా ప్రాజెక్టు డైరక్టర్ డాక్టర్ డి.రవీంద్ర, సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ(యానాదులు)ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ మందా రాణి, గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి పరిమళ, మైనార్టీ సంక్షేమ అధికారి డాక్టర్ ఏ.నిర్మలాదేవి తదితర శాఖల అదికారులు క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలిపారు.

# కార్పోరేషన్ విలీన గ్రామల్లో కనీస మౌళికవసతులు కరువు



**నెల్లూరు,డిసెంబరు24 ప్రభావార్త-విద్య** పేరుకు నెల్లూరు కార్పోరేషన్ పరిధిలో ఉన్నా విలీన గ్రామాల పరిస్థితి దుర్భరంగా ఉందని, కనీస మౌళిక వసతులు లేక స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని స్థానిక 30వ డివిజన్ శ్రామిక్‌నగర్‌లో జనసేన పార్టీ నాయకులు శ్రీను ఆద్వర్యంలో జనసేన పార్టీ పతాక ఆవిష ్కరణను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గునుకుల ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. 8 సంవత్సరాలక్రితం ఈ గ్రామాలు కార్పోరేషన్‌లో విలీనం అయినా నేటికి డ్రెయినేజీ కాలువలు, తాగునీరు, వీధిలైట్లు, సిసిరోడ్లు ఏర్పాటు నేటికి పూర్తి కాలేదన్నారు. వర్షం పడితే కొత్తూరు, వైఎస్ఆర్ నగర్,శ్రామిక్ నగర్‌లో ప్రజల పరిస్థితి దారునాతి దారుణంగా ఉంటుందని గుర్తుచేశారు. ఇటీవల తుఫాను కారణంగా వీరికి 4 రోజులు మంచినీరు కూడా అందలేదని, ఇళ్లలోనుండి ప్రజలకు బయటకి రావటానికి 5 రోజులు పట్టిందన్నారు. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా అధికారుల, వైకాపా నాయకులు పట్టించుకోకపోవటం దారుణమన్నారు. రూరల్‌లో అభివృద్ధి కేవలం శంకుస్థాపనరాళ్లు పాతిపెట్టే వరకే జరుగుతుందన్నారు. దశాబ్దకాలం క్రితం సైడు కాలువ నిర్మాణానికి పునాది రాళ్లు వేశారని, నేటికి అవి పూర్తికాలేదని ఏద్దేవా చేవారు. వైకాపా నాయకులకు ఓట్లు తప్ప ప్రజలు పడే కష్టాలు వారికి పట్టవని దుయ్యబట్టారు. వెంటనే స్థానిక సమస్యలను పరిష్కరించాలని లేకుంటే ఆందోళణ చేపడతామని హెచ్చరించారు. ప్రజలకు సేవ చేసేందుకు విలాసవంతమైన జీవితాన్ని విడిచిపెట్టి రాజకీయాల్లోకి వచ్చిన పవన్ కళ్యాణ్‌ను ఆదరించాలని కోరారు. రాష్ట్ర బవిష్యత్ కోసం తమ అధినేత తీసుకున్న ఏ నిర్ణయానికైనా తాము కట్టుబడి ఉంటామన్నారు. అలాగే కృష్ణవేణి పార్టీలో చేరిననాటి నుండి అనేమంది మహిళలతో స్థానిక సమస్యలపై పోరాటాలు చేశారని, ఇటువంటి నాయకులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం జెండా ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో సిటీ కార్యదర్శి కృష్ణవేణి, స్థానిక నాయకులు శ్రీను, ప్రవీణ్, నజీర్, గురవయ్య, రేణుక, హేమచంద్ర, ప్రశాంత్‌గౌడ్, అమీన్, కేశవ, పాల్గొన్నారు.

# మాన్యువర్ కు ప్రచారకర్తగా రామ్‌చరణ్

**నెల్లూరు,డిసెంబరు24 ప్రభాతవార్త-విద్య** తమ సంస్థ వివాహ వలెక్షన్‌లను ప్రజలకు అందించటంలో ఎల్లపుడు ప్రప్రదమంగానే ఉంటుందని, ప్రస్తుతం తమ సంస్థకు గోబ్లల్, మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్ ప్రచార కర్తగా వ్యవహరించటం సంతోషంగా ఉందని వేదాంత్ ఫ్యాషన్స్ లిమిటెడ్ చీఫ్ రెవెన్యూ అధికారి వేదాంత్‌మెడీ పేర్కొన్నారు. ఆదివారం నగరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మాన్యువర్ యొక్క కలెక్షన్స్‌లో పంచకచం, వేష్టిని ప్రవేశపెట్టటం జరిగిందన్నారు. దక్షిణాదిలో సూపర్‌స్టార్‌గా వెలుగోందుతున్న రామ్‌చరణ్, శోభిత దూళిపాళ్లపై తమ బ్రాండ్ కు సంబందించిన ప్రచార చిత్రాన్ని తెరకెక్కించి విడుదల చేయటం జరిగిందని,దీంతో తమ వ్యాపారాన్ని విస్తరించటం తధ్యమని ధీమా వ్యక్తంచేశారు. దక్షిన భారతదేశానికి నిబ్బదతో పెళ్లి వస్త్రాలు అందించటం తమకు గర్వకారణమని, వినియోగదారులకు మెరుగైన దుస్తులను అత్యల్ప దరల్లో అందించటమే తమ లక్ష్యమన్నారు. శ్రేయాన్స్ ఇన్నోవేషన్స్ వ్యవస్థాపకులు మాన్యువర్, తయారీ రెండు ఒకదానితో మరోకటి కలిసి ఉంటాయని, ఇనాళ్లు తైయార్‌హోకర్ అయ్యే యుట్యూ ఉన్న ప్రత్యేకమైన కధనాల ద్వారా పిళ్లికి సిద్దంగా ఉన్న దస్తులను అందించామన్నారు. ప్రస్తుతం తాము నిర్మించిన ప్రచార చిత్రంలో రామ్‌చరన్ శారీరక వేషదారణకు మించి మానశికంగా కూడా సిద్ద పరిచే విధంగాకనిపిస్తున్నారని పేర్కొన్నారు. రామ్‌చరణ శోభితల సహకారంతో తాము సాం ప్రదాయ బద్ధం గా ఈ ప్రక్రియను పూర్తిచేయటం జరిగిందని ఎప్పటిలాగా తమను అందరూ ఆదరించాలని కోరారు. ఈకార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

## విద్యుత్ దీపాలతో ముస్తాబైన చర్చిలు





ఫోటోలు :నందా మాల్యాద్రి





## ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



**బిట్రగుంట, డిసెంబరు 24 ప్రభాతవార్త** బోగోలు మండలం తాటిచెట్ల పాళెం గ్రామంలో ఆదివారం ఆంజనేయస్వామికి పసుపులేటి సుధాకర్‌రావు ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పసుపులేటి వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జరుగుతున్న ఆంజనేయస్వామి ఉత్సవాలలో ఆయన పాల్గొని నియోజకవర్గంలోని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వుండాలని పసుపులేటి సుధాకర్ నాయకత్వంలో కావలి నియోజకవర్గం అభివృద్ధి జరగాలని కోరుకున్నట్లు తెలిపారు.

## చెన్నకేశవ స్వామి ఆలయానికి విరాళం



**వరికుంటపాడు, డిసెంబర్ 24, ప్రభాతవార్త** : మండలంలోని యర్రం రెడ్డిపల్లి లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి ఆలయ నిర్మాణానికి, తోటల చెరువుపల్లి గ్రామానికి చెందిన ముల్లంగి శ్రీను తన తల్లి మల్లంగి కనకమ్మ పేరుపై 50116 రూపాయల నగదును విరాళంగా అందజేశారు. ఈ నగదు ఆదివారం ఆలయ నిర్వహక కమీటి సభ్యులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ముల్లంగి శ్రీనివాసులుకు ఆలయ కమీటి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీ లక్ష్మిచెన్నకేశవ స్వామి అశీస్సులతో ఆయనకు అంతా మంచే జరగాలనీ, మరింత వృద్ధి చెంది తన దాన గుణాన్ని మరింత మందికి చేరువ చేయాలనీ కమీటి సభ్యులు అకాక్షించారు. ఈ కార్యక్రమములో తోటల చెరువుపల్లి గ్రామ సర్పంచ్ పేర్లంపాటి పెద్ద మౌలాలి, స్తానికులు పత్రి జాని, ఆలయ కమీటి సభ్యులు మాచర్ల బ్రహ్మయ్య, బాలకేశవులు తదితరులు పాల్గొన్నారు.




## చర్చిలకు కేకులు అందజేసిన మేకపాటి రాజగోపాల్ రెడి



**వరికుంటపాడు, డిసెంబర్ 24, ప్రభాతవార్త** : క్రిస్మస్ పండుగను పురష్కరించుకొని మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో ఉన్న అన్ని చర్చిలకు ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి సమకూర్చిన కేకులను ఆదివారం వైకాపా మండల పార్టీ కన్వీనర్ మందలపు తిరుపతినాయుడు, మాజీ ఎఎంసి చైర్మన్ షేక్ అలీఅహ్మద్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రైస్తవ సోదరులు ఆనందంగా తమ క్రిస్మస్ పండుగను జరుపుకోవాలనే ధ్యేయంతో మేకపాటి రాజగోపాల్ రెడ్డి ప్రతి చర్చికి కేకును అందజేయడం జరిగిందన్నారు. పార్టీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు దాసరి యర్రా ఓబయ్య, నేతలు ప్రభాకర్‌రెడ్డి, అబ్బు లేమ్, మోహన్, ఎల్ఐసి నారాయణ, వెంకటేశ్వర్లు, సాయి తదితరులు పాల్గొన్నారు.

## అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు సీఎం కావాలి



**నెల్లూరు, డిసెంబర్ 24, ప్రభాతవార్త – వైద్యం** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు అభివృద్ధిలోకి రావాలంటే తెలుగుదేశం పార్టీ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని తెలుగుదేశం పార్టీ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. రూరల్ నియోజకవర్గంలోని కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన సీనియర్ నేతలు కల్లూరు రాఘవేంద్రరరావు, తుపాకుల ప్రకాష్, మాజీ సర్పంచ్ కొండేపి భాస్కర్‌తో పాటు సుమారు 300 మంది నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో గత నెల ఓజులుగా పెద్ద ఎత్తున పలువురు నేతలు చేరుతున్నారని, వారందరికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో మరో రెండు నెలలు తర్వాత సార్వత్రిక ఎన్నికలు నోటీఫికేషన్ రానుందని, ఈ ఎన్నికల్లో టీడీపీ– జనసేన కూటమి ఘన విజయం సాధిస్తుందని ఆయన పేర్కొన్నారు. నూతనంగా చేరే వారిపై ఎన్నిక ఒత్తిడిలు వచ్చిన వారు టీడీపీ వైపే మొగ్గుచూపుతున్నారన్నారు. పార్టీలో నూతనంగా చేరిన ప్రతి ఒక్కరికి తగు ప్రాధాన్యత ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నేత అరవి శ్రీనివాసులు, కనపర్తి గంగాధ్, గువ్వా వెంకటేశ్వర్లు, సాయి ప్రసాద్, దేవరాల శశి, వేల్పుల అజయ్, అశోక్‌రెడ్డి, పి.హరికృష్ణ, శేషారెడ్డి, వొట్టూరు సురేంద్ర, బొందిలిగిరి బాబు, దుగ్గుశెట్టి కోటేశ్వరరావు, చిట్టిబాబు, ఉయ్యాల జగన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న భారీ ర్యాలీ

**కోవూరు, డిసెంబరు24 ప్రభాతవార్త** : కోవూరు పురవీధుల్లో ఆదివారం సమరతాసేవా సంస్థ ఆధ్వర్యంలో రామభక్తులు నగర సంకీర్తన కార్యక్రమాన్ని భారీ స్థాయిలో చేపట్టారు. స్థానిక కోదండరామ స్వామి ఆలయ ప్రాంగణం నుంచి బయలుదేరిన ఈ ర్యాలీ ప్రధాన రహదారి, తదితర ప్రాంతాల్లో రామనామ సంకీర్తన చేసుకుంటూ భక్తిశ్రద్ధలతో చేపట్టారు.

## వైసిపి జిల్లా బిసిసెల్ కార్యదర్శిగా భోజనపు



**వింజమూరు, డిసెంబర్24, ప్రభాతవార్త** : వైసిపికి జిల్లా బిసిసెల్ కార్యదర్శిగా వింజమూరు బిసి కాలనీకి చెందిన భోజనపు గోపి నియమితులైనట్లు మండల కన్వీనర్ రేవనూరి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఈసందర్భంగా గోపి మాట్లాడుతూ వింజమూరు మండలంలోని వైసిపి ముఖ్యనేతలు తనపై ఎంతో నమ్మకంతో ఉదయగిరి నియోజకవర్గ సమన్వకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి తన పేరును సూచించి వైసిపి లో సముచిత స్థానకల్పించేందుకు కృషి చేసిన వారికి ధన్యవాదాలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైసిపి గెలుపుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. అనంతరం గోపి మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

## ముందర పొట్టెమ్మ పొంగళ్ళలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి రూరల్, డిసెంబరు 24 ప్రభాతవార్త కావలి రూరల్ మండలం పెద్దపట్టపుపాళెం గ్రామ మాజీ సర్పంచ్, కావలి మండల జెసిఎస్ కన్వీనర్ నాగన్నగారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో అమ్మలుగన్న అమ్మ శ్రీ ముందర పొట్టెమ్మ దేవాలయంలో ఆదివారం పొంగళ్ళ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పాల్గొని ముందర పొట్టెమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కావలి ఎయంసి చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్ యాదవ్, జెడ్పీటీసీ జంపాని రాఘవులు, వైసిపి నేతలు జనిగర్ల మహేంద్ర యాదవ్, చెన్ను ప్రసాద్‌రెడ్డి, కుందుర్తి కామయ్య తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా హనుమత్ వ్రతం



**కోవూరు, డిసెంబరు 24 ప్రభాతవార్త** కోవూరులో వెలసియున్న శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం హనుమత్ వ్రత కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ప్రాత:కాలమునే స్వామి వారికి ప్రత్యేక పూజలను ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజచార్యుల ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో స్థపన తిరుమంజనం, అర్చన, పుణ్యాహావచనం కార్యక్రమాలను భక్తిశ్రద్దలతో చేపట్టారు. అనంతరం కోదండరామస్వామి దేవస్థాన ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్ చార్యులు ఆధ్వర్యంలో స్వామి వారి హనుమత్ వ్రతాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రుత్వికులు శ్రీనివాసాచార్యులు హనుమత్ వ్రత విధానాన్ని చేపడితే వచ్చే పుణ్యఫలాలను వ్రతంలో పాల్గొన్న దంపతులకు వివరించారు. అనంతరం హనుమత్ గాయిత్రీ హోమాన్ని పూర్ణాహుతి కార్యక్రమాలను భక్తిశ్రద్దలతో చేపట్టారు. ఈ కార్యక్రమంలో రుత్వికులు కృష్ణమాచార్యులు, రాఘవాచార్యులు, శేఖర్‌స్వామి, నందకుమార్ స్వామి, సుబ్బయ్యస్వామి తదితరులు ఉన్నారు. ఈ పర్వదినాన్ని పురస్కరించుకొని పూలంగిసేవ, పల్లకీసేవ కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్దలతో నిర్వహించారు. ఈ వ్రతంలో పాల్గొన్న భక్తులకు భారీస్థాయిలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## నారాయణ గెలుపు ఖరారు

**నెల్లూరు, డిసెంబర్ 24, ప్రభాతవార్త– వైద్యం** నగర నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ మాజీ మంత్రి పొంగూరు నారాయణ గెలుపు ఖాయమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఆదివారం నంగరంలోని 10వ డివిజన్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షులు, 10వ డివిజన్ ఇన్‌ఛార్జ్ కాకర్ల తిరుమలనాయుడు అధ్యక్షతన టీడీపీ నాయకులు, డివిజన్ కమిటీ సభ్యులతో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ తాళ్లపాక అనురాధ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం ఖాయమైంది. సిట్టింగ్ ఎమ్మెల్యేలను పక్కన పెట్టినా, పక్క నియోజకవర్గాలకు మార్చినా టీడీపీ గెలుపును జగన్ ఆపలేడన్నారు. దొంగ ఓట్లు, డబుల్ ఓట్లు, వాలంటీర్లు, ధన ప్రలోభాలతో ఎన్నికలను దాటవచ్చని జగన్ కలలు కంటున్నారన్నారు. తెలంగాణ ఎన్నికల్లో బీఆర్ఎస్ దుస్థితి వైసీపీకి పట్టనుందని తెలిపారు. వైసీపీ పాలనలో నెల్లూరు నగరం అనాధగా మారింది. అనిల్ రెండున్నారేళ్లుగా మంత్రిగా ఉన్నా నెల్లూరు నగరం అభివృద్ధికి నోచుకోలేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో నారాయణ నేతృత్వంలో నెల్లూరు నగరం రాష్ట్రానికే రోల్‌మోడల్‌గా నిలిచేది, నేటి వైసీపీ పాలనలో గంజాయి, హత్యలు, దాడులకు కేంద్ర బిందువుగా మారిందని శ్రీనివాసులు వివరించారు. దశాబ్దాల పాటు పట్టే అభివృద్ధిని 5 ఏళ్లలో చేసి చూపిన ఘనత నారాయణది, ఆయన చేసిన అభివృద్ధి తాలూకు 10శాతం పెండింగ్ పనులను 4.5 ఏళ్లుగా పూర్తి చేయలేక చతికిల పడిన చరిత్ర వైసీపీ పాలకులదన్నారు. నాలుగేళ్లుగా నెల్లూరు నగర అభివృద్ధి కుంటుపడింది. ఆగిపోయి అభివృద్ధి గాడిన పడాలంటే నారాయణ తిరిగి రావాలని నగర ప్రజలు బలంగా కోరుకుంటున్నారు. ఈ సమావేశంలో డివిజన్ అధ్యక్షులు కాకర్ల వెంకటరావు, నాయకులు విజయ్‌కుమార్, గురు ప్రసాద్, దోర్నాల హరిబాబు, శ్రీనివాస్ యాదవ్, మల్లిఖార్జున, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## నిరంజన్‌బాబురెడ్డిని అభినందించిన నేతలు



**కోవూరు, డిసెంబరు24 ప్రభాతవార్త** : కోవూరు మండలం పడుగుపాడు గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ షేక్ అహ్మద్ వైసీపీ జిల్లా మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శి గానూ షేక్ జిలానీబేగంను కార్యర్శిగా నియమించారు. ఈ మేరకు ఆదివారం వారు రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు నిరంజన్‌బాబురెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి బొకేతో అభినందించారు. తమపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డికి రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీఏ డైరెక్టర్ కాటంరెడ్డి దినేష్‌రెడ్డి, జలజీవన్ మిషన్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, వైసీపీ నాయకులు షబ్బీర్, నాగార్జున, తదితరులు ఉన్నారు.

## కోనలో వైభవంగా హనుమత్ వ్రత వేడుకలు

**పెంచలకోన(రాపూరు), డిసెంబరు24 ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో ఆదివారం హనుమత్ వ్రతం సందర్భంగా శ్రీ అంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్గశిర మాసంలోవచ్చే హనుమత్ వ్రతం సందర్భంగా స్వామి వారికి విశేష పూజలు, అంజనేయ స్వామి వారికి వైభవంగా కోనలోనిమాఢవీదులలో క్షేత్రోత్సవం వైభవంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## హిందూ ధర్మమే సర్వశ్రేష్ఠ జీవన విధానం



**కోవూరు, డిసెంబరు24 ప్రభాతవార్త** : ప్రపంచంలోనే అత్యంత పురాతనమైనది హిందూ జాతి అని పాశ్చాత్య జాతులు నాగరికత అంటే ఏమిటో తెలియక అడవుల్లో బతుకుతున్నప్పుడే ఆర్నాల్డ్ టాయ్‌ఎన్‌బీ వంటి పాశ్చాత్య చరిత్ర కారులే హిందూ ధర్మం గురించి గొప్పగా రాశారని సమరతాసేవా సంస్థ రాష్ట్ర భౌదిక్ ప్రముఖ్ పి. శేషు అన్నారు. కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో ఆదివారం సమరతాసేవా సంస్థ ఆధ్వర్యంలో హిందూ ధార్మిక సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యం ఒక్కటే అని , మహా పురుషులు అనేక విధాలుగా బోధిస్తారని చెప్పింది హిందూ ధర్మం ఒక్కటే అన్నారు. మిగిలిన మతాలు తమ మతం ఒక్కటే శ్రేష్టమైనదని, మిగిలినవన్నీ నిరర్ధకమైనవని చెబుతూ ఆత్మస్తుతి పరనిందకు పాలనపడుతున్నారన్నారు. ప్రపంచంలోని మతాలన్నీ ఏదో ఒక ప్రవక్త ద్వారా ప్రారంభమై ఆ ప్రవక్త బోధనలే వారికి ప్రామాణికం తప్ప ఇతర ఆలోచనలను దరిచేరనీరన్నారు. ఈ విధంగా క్రైస్తవులు ఏసుక్రీస్తును, బైబిల్‌ను అనుసరిస్తే.. ముస్లింలు మహ్మద్ ప్రవక్తను, ఖురాన్‌ను అనుసరిస్తారన్నారు. అయితే హిందువులకు ఒకే దేవుడు గానీ, ఒకే ప్రవక్త గానీ, ఒకే గ్రంథం గానీ లేవన్నారు. బహుముఖంగా వికసించి విస్తరించినదే హిందూ ధర్మమని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ముక్కోటి దేవతలు, అసంఖ్యాకులైన ప్రవక్తలు , వేదాలు, పురాణాలు రామాయణ భారత భాగవతాది అనేక గ్రంథాల్లో ప్రపంచ విజ్ఞాన సర్వస్వం అంతా హిందూ ధర్మములో ఉందన్నారు. ప్రపంచంలో ఇతర జాతులన్నీ స్త్రీని పురుషుడు అనుభవించే ఒక భోగ వస్తువుగా భావిస్తారని, కానీ హిందూ జీవన విధానంలో పరస్త్రీని కూడా తల్లిగా చూసే సంస్కారాన్ని బాల్యం నుంచే అంతరికీ అలవాటు చేస్తారన్నారు. భగవంతుడిని నమ్ముకున్న వారు కాపాడుతారని చరిత్రలో ప్రహల్లాదుని, ద్రౌపది చరిత్రను ఉదాహరణంగా తీసుకోవచ్చన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా సమరతాసేవా కన్వీనర్ రమణయ్య, సబ్ కన్వీనర్ రమణారెడ్డి, సబ్ డివిజన్ ధర్మప్రచారక్ పి. శ్రీనివాసులు, సబ్ డివిజన్ సహ కన్వీనర్ డి. వెంకటేశ్వర్లు, మండల బీజేపీ అధ్యక్షుడు రఘురామయ్య, తదితరులు ఉన్నారు.

## ప్రజా సేవ చేసేందుకు ఛారిటబుల్ ట్రస్ట్‌లు ముందుకు రావడం ప్రశంసనీయం



**బిట్రగుంట, డిసెంబరు 24 ప్రభాతవార్త** నిరుపేదలను ఆర్థికంగా ఆదుకుని ప్రజా సేవ చేసేందుకు ఛారిటబుల్ ట్రస్ట్‌లు ముందుకురావడం ఎంతైనా ప్రశంసనీయమని సోమశిల ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ కండ్లగుంట మధుబాబునాయుడు చెప్పారు. బోగోలు మండలం నాగులవరం గ్రామంలో ఆదివారం కంచర్ల కొండపనాయుడు ఛారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంచర్ల కొండపనాయుడు ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు కంచర్ల మాధవి గతంలో నాగులవరం గ్రామంలో శివాలయ నిర్మాణంలో మూలవిరాఠ్ విగ్రహాలు, ఉత్సవ విగ్రహాలు వంటి వాటికి కూడా దాతృత్వం చేపట్టారని కొనియాడారు. ట్రస్ట్ నిర్వాహకురాలు కంచర్ల మాధవి మాట్లాడుతూ కావలి మాజీ శాసనసభ్యులు స్వర్గీయ గొట్టిపాటి కొండపనాయుడు, గుంటూరు మాజీ ఎంపి రాయపాటి సాంబశివరావుల ఆశయాల మేరకు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి స్పూర్తితో తాను తన తండ్రి పేరిట ఛారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భవిష్యత్‌లో తమ ట్రస్ట్ ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వారికి తగినంత ప్రోత్సాహకరంగా ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. తొలుత నాగులవరం దళితవాడలో క్రిస్మస్‌ను పురస్కరించుకొని నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాగులవరం గ్రామ మాజీ సర్పంచ్‌లు నందిపాటి పద్మనాభం, గణేషం రమేష్‌రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఐ.కె.ఎం.ఎస్ 3వ జిల్లా మహాసభను విజయవంతం చేయండి

**రాపూరు, డిసెంబరు24 ప్రభాతవార్త** అఖిల భారత రైతు కూలి సంఘం ఉమ్మడి నెల్లూరు జిల్లా 3వ మహాసభను విజయవంతం చేయాలనిఐ.కె.ఎం.ఎస్ ఉమ్మడి నెల్లూరు జిల్లా కన్వీనర్ డి.పి.పోలయ్య కోరారు. ఈ సమావేశం ఉమ్మడి నెల్లూరు జిల్లాలోనిగూడూరు డివిజన్ కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవనం నందు నిర్వహించనున్నామన్నారు. ఈ సందర్భంగాఆయన మహాసభలకు సంబందించిన పోస్టర్‌ను అవిష్కరించారు. అమరుల త్యాగాలతో తెలంగాణా, నక్సల్ బరిశ్రీకాకుళం, గోదావరి లోయ ప్రతిఘటన పోరాటాల సంప్రదాయాలను పుణికి పుచ్చుకోని అఖిల భారత రైతు కూలీసంఘం పురుడు పోసుకుందన్నారు. దున్నే వాడికే భూమి కావాలని, భూస్వామ్య పెట్టుబడి దారీ, సామ్రాజ్యవాదం అంత కావలనే లక్ష్యంతో ఈ సంఘం ఏర్పాడిందన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో మూడు శతాబ్దాలకు పైగాఅఖిల భారత రైతు కూలి సంఘం పని చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా గూడూరు డివిజన్‌లోని రాపూరు, సైదాపురం, డక్కిలి, బాలాయపల్లి మండలల్లో అనేక గ్రామాలలో భూ సమస్యపై పోరాడి విజయం సాదించడం జరిగిందన్నారు. ఈ నెల 30వ తేది జరిగే 3వ మహా సభలో అనేక విషయాలపై తీర్మాణాలు చేయడం జరుగుతుందని ప్రతి ఒక్కరు ఈ సమావేశానికి హాజరై సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు. సంస్థజిల్లా కార్యదర్శి కె. రమేష్, మండల నాయకులు సంజీవులు, సుధాకర్, అంకయ్య, శినయ్య తదితరులున్నారు.